గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తా



ఎల్‌బీనగర్‌లో ప్రచారం చేస్తున్న వైష్ణవీ ప్రసాద్‌కు మద్దతు తెలుపుతున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి తనను ఎంపీగా గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్(వైష్ణవీ ప్రసాద్) అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, శివగంగ కాలనీ, నాగోలు పరిధిలోని సాయినగర్ కాలనీ, మమతానగర్, ఉప్పల్, మేడ్చల్, మల్కాజిగిరి ప్రాంతాల్లోని మంగళవారం వివిధ కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ గెలిపిస్తే ప్రజలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందిస్తానని, ప్రతీ నియోజకవర్గంలో ఆదర్శ విద్యాలయాలు, ధర్మాసుపత్రులు నెలకొల్పుతానని అన్నారు. నిత్యం ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపరచిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దడ్డు సుబ్రహ్మణ్యం, రాజేశ్వరరావు, ప్రబల విశ్వానాథం, కైలాస్, సుశీల, చంద్రకళా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన లోటస్ ల్యాప్ స్కూల్ విద్యార్థులు

బోడుప్పల్: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి వెల్లడించారు. బోడుప్పల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. మానస, శ్రీనవ్య 10/10 జీపీఏ సాధించగా, శశి ప్రియ, ఆశ్రిత, సంకీర్త, నితిన్ కుమార్, మోహిత్ 10/9.8 జీపీఏ సాధించగా, మేధా సంజన, అక్షయ్, ధనుష్, నివేదిక సాత్విక్, సుప్రీత్ 10/9.5 జీపీఏ సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గోపాల్‌రెడ్డి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ప్రజలకు ఈటల క్షమాపణ చెప్పాలి

గౌతంనగర్: మల్కాజిగిరి ప్రజలపై అనుచిత వ్యాఖలు చేసిన బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మేకల రాముయాదవ్ డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో ఈటల రాజేందర్ మల్కాజిగిరి ప్రజలు మద్యం, డబ్బులకు అమ్ముడుపోతారని వ్యాఖలు చేశారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఈటల వ్యాఖలకు నిరసనగా మల్కాజిగిరి సాయినగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇప్పటికైనా మల్కాజిగిరి ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. నాయకులు సిద్దిరాములు, సాదు పరమేష్, భిక్షపతి, బైరు అనిల్, మల్లేష్ యాదవ్, నర్సింగ్, నగేష్‌గౌడ్, శ్రీనివాస్, కిట్టు, కన్నా, షేక్ ఉన్నారు.

ఈటల దిష్టిబొమ్మ దహనం హేయం

మల్కాజిగిరి: ఫేక్ వీడియోస్ ప్రచారం చేయడమే కాకుండా మల్కాజిగిరి ప్రాంతంలో ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఖండించారు. పార్టీ కార్యాలయంలో శ్రవణ్ మాట్లాడుతూ ఎన్ని కుయుక్తులు పన్నినా మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ గెలుచుకోవడం ఖాయమన్నారు. ప్రచారంలో రోజురోజుకూ ఈటలకు వస్తున్న ఆదరణ ఓర్వలేక ఓ పార్టీ వారు ఫేక్ వీడియోలు సృష్టిస్తే, మరో పార్టీ వారు దాన్ని వారి స్వార్థానికి ఉపయోగించుకొని పబ్బం గడుపుకుంటున్నారన్నారు. సమావేశంలో మహేందర్, శ్రీనివాసరెడ్డి, హరీష్, బలరాం, వేణు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సాగర్ గ్రామర్ స్కూల్ విద్యార్థుల హవా



ఉప్పల్: పదో తరగతి ఫలితాల్లో సాగర్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు ప్రిన్సిపల్ ధన్‌సాగర్ తెలిపారు. ఉపాధ్యాయులు అంకితభావం, విద్యార్థుల కృషితో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. 10/10 సాధించిన విద్యార్థులు పి.వినయ్, ఎస్.స్వేత, కె.సాహితీ 9.8 జీపీఏ సాధించినట్లు తెలిపారు. వరుణ్, సౌమ్య, కె.రిషిత 9.8 జీపీఏ సాధించినట్లు తెలిపారు. మండల పరిధిలోని తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



పోగుల నరసింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగల నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కార్పొరేటర్లు చందర్‌గౌడ్, కళ్యాణ్ కుమార్, నేతలు తరుణ్‌గౌడ్, యాదగిరి, విశ్వంగుప్తా, అంజి పాల్గొన్నారు.

అల్లూరి శత వర్ధంతి వేడుకలు



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు

కుషాయిగూడ: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌బీకాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు, సామాజిక ఉద్యమ నేత కోమటి రవి, రాజమల్లు, గిరీష్, వెంకటాచారి, శారద, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం కష్టపడి పనిచేద్దాం



వెంకటాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



బోడుప్పల్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: కలిసికట్టుగా కృషి చేద్దాం.. కారు గుర్తుకు ఓటేద్దామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని శ్రీసాయి ఎన్‌క్లేవ్ సామాజిక భవనంలో మంగళవారం బూత్‌స్థాయి సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్ హాజరై మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి ఓటరును కలిసి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించి మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో గెలిచేలా కృషి చేయాలన్నారు. నాయకులు రావుల అంజయ్య, అనిల్‌కిషోర్‌గౌడ్, సంపత్, ప్రభాకర్, శ్రీనివాస్, సయ్యద్ మోసీన్, దేవయ్యగౌడ్, వీరేశం, శంకర్, సురేష్, లక్ష్మీనారాయణ, ప్రకాష్‌గౌడ్ ఉన్నారు.

లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేద్దాం

బోడుప్పల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేద్దామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్ 8వ డివిజన్ మంగళవారం నిర్వహించిన గడప గడప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నాయకులు శ్రీహరిగౌడ్, ఎండీ అలీం, మోతే రాజు, కడమంచి బాలు, తూర్పాటి నర్సింహ, శివ పాల్గొన్నారు.

బడే బాయ్.. చోటే బాయ్‌కి బుద్ధి చెబుదాం

ఉప్పల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బడే బాయ్(మోదీ), చోటే బాయ్(రేవంత్ రెడ్డి)లకు ఓటుతో బుద్ధి చెబుదామని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా డివిజన్‌లో నాయకులు కార్యకర్తలతో కలిసి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కోకొండ జగన్, బింగి శ్రీనివాస్, శ్యామ్, బాలు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

మల్లాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి లక్ష మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నాచారంలో రాగిడి లక్ష్మారెడ్డి మద్దతుగా మంగళవారం ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మల్లాపూర్‌లో..

ఓల్డ్ మల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ నేతలు కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ నేతలు భూమండ్ల శ్రీశైలం, మహేందర్‌గౌడ్, కిషోర్, రాజు యాదవ్, మేఘరాజు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీకి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. నిత్యం ఇంటింటి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. కార్పొరేటర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో మీర్‌పేట్, లక్ష్మీనగర్ కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం సాగిస్తున్నారు. నాలుగు నెలల కాలంలోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీని చీదరించుకుంటున్నారన్నారు. ప్రజల్లో వచ్చిన మార్పే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్



చిలుకానగర్‌లో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రచారం



నాచారంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఈటలను గెలిపించాలంటూ ప్రచారం



మాట్లాడుతున్న జాతీయ సంఘం అధ్యక్షుడు చెన్నారావు

అల్వాల్/గౌతంనగర్: మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని బీజేపీ నేత శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఉత్తంనగర్, దయానంద్‌నగర్‌లో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ స్లిప్పులను అందజేశారు.

అల్వాల్‌లో..

మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మంగళవారం అల్వాల్‌లోని పెంటారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో బీజేపీ జిల్లా కార్యదర్శి చింతల మాణిక్యరెడ్డి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అల్వాల్ డివిజన్ అధ్యక్షులు కార్తీక్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ క్రిష్ణారెడ్డి, రామారావు, అనిల్, లక్ష్మణ్, ప్రశాంత్, అంజి పాల్గొన్నారు.

జోరుగా ఈటలకు మద్దతుగా ప్రచారం

మల్కాజిగిరి: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ప్రచారం జోరందుకుంది. జాతీయ వాయిద్య కళాకారుల సంఘం, రాష్ట్ర బ్యాండ్ కళాకారుల సంఘం ఈటలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. హుస్సేన్, సురేష్, నగేష్, లక్ష్మీనారాయణ, కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఆర్.కె.నగర్‌లో ప్రచారం నిర్వహించారు. శివానంద్, హరీష్, శ్రీధర్, రాజు, రంగరాజన్ పాల్గొన్నారు.

మోదీని పీఎం చేసేందుకు ప్రజలు సిద్ధం

రామంతాపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రి చేసేందుకు దేశంలోని ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. రామంతాపూర్‌లోని భరత్‌నగర్, శ్రీనగర్ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో ఆయన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, నేతలతో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేతలు రేవు నరసింహ, సాగర్, రవీందర్, వేముల వెంకట్, రాపోలు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రభాకర్, కార్పొరేటర్



అల్వాల్‌లో చింతల మాణిక్యరెడ్డి ప్రచారం



ఆర్‌కేనగర్‌లో కార్పొరేటర్ శ్రవణ్



గౌతంనగర్‌లో బీజేపీ నేత శ్రీనివాస్ ముదిరాజ్

బాక్సింగ్‌లో రోహన్‌కు గోల్డ్ మెడల్



మల్కాజిగిరి: 7వ యూత్ రాష్ట్ర బాక్సింగ్ పోటీల్లో మల్కాజిగిరికి చెందిన కాసా రోహన్ గోల్డ్ మెడల్ సాధించాడు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ నిర్వహించిన 51–54 కేజీ విభాగంలో హిందుస్థాన్ బాక్సింగ్ క్లబ్ తరపున కాసా రోహన్ పాల్గొన్నాడు. రోహన్‌ను కోచ్ సాగర్, స్థానికులు అభినందించారు.

కార్మికుల పక్షపాతి కాంగ్రెస్



లాలాగూడ వర్క్‌షాపు వద్ద ప్రచారం చేస్తున్న మైనంపల్లి, సునీతారెడ్డి



గౌతంనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మనీషారెడ్డి



బోడుప్పల్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బొమ్మక్ శ్రీనివాస్

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ అనుబంధంగా ఉన్న ఐఎన్‌టీయూసీ కార్మికుల పక్షపాతిగా ఉంటుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. లాలాగూడలోని రైల్వే వర్క్‌షాపు వద్ద పార్టీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డితో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, జీఎస్వీ సతీష్‌కుమార్, ఉమేష్‌సింగ్, వినోద్‌యాదవ్, సత్యనారాయణ, బాబు, బి.కె.శ్రీను, కన్న, ఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం..

అల్వాల్/గౌతంనగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలో పట్నం సునీతా మహేందర్‌రెడ్డి కూతురు మనీషారెడ్డి ప్రచారం నిర్వహించారు. మల్కాజిగిరి పట్టణ బీ-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు మోహన్‌రాజు, ప్రవీణ్, పాండు, ముత్యాలు, పోచయ్య, మణి, దాస్, ఇస్తారి పాల్గొన్నారు.

మచ్చబొల్లారంలో..

అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారంలో కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డివిజన్ ఇన్‌చార్జి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బోనగిరి సురేష్ యాదవ్ ప్రచారం నిర్వహించారు.

గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పొద్దుటూరు నర్సింగ్‌రావుగుప్తా, కాలనీ మాజీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మల్లప్ప సుభాష్, కాలనీవాసులు మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రావణ్‌యాదవ్, మహమ్మద్ ఇస్మాయిల్, భీమయ్య, సానిల్, లక్ష్మణ్, మహిళలు పాల్గొన్నారు.



గౌతంనగర్‌లో బోనగిరి సురేష్ యాదవ్



నేరేడ్‌మెట్‌లో కాంగ్రెస్ నేత చెన్నారెడ్డి



మచ్చబొల్లారంలో రాజ్ జితేంద్రనాథ్ ప్రచారం

పురుగుల మందు తాగిన మహిళ మృతి

ఉప్పల్: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ లక్ష్మీనారాయణ కాలనీలో నర్మదారెడ్డి(50) నివాసం ఉంటోంది. ఈ నెల 5వ తేదీన రాత్రి తీవ్ర కడుపు నొప్పి రావడంతో భరించ లేక పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న కూతురు నవనీత వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మహిళలు స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి



మల్లాపూర్: కుట్టుమిషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధిపై దృష్టిసారించి ఆర్థికంగా ఎదగాలని మాన్ సమ్మాన్ ట్రస్ట్ ప్రతినిధులు పూజ గోయల్, రాకేష్ గోయల్ అన్నారు. మల్లాపూర్ ఎక్స్‌ట్రామైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడిపిస్తున్న సబల మహిళా నైపుణ్యాభివృద్ధి సంస్థలో 4వ బ్యాచ్ పూర్తి చేసుకున్న ఐదుగురు మహిళలకు మాన్ సమ్మాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఎక్స్‌ట్రా మైల్‌సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు నాగమోహన్, సెంటర్ సంచాలకులు చేగూరి నరేందర్, ట్రైనర్ సరిత పాల్గొన్నారు.

లోన్ యాప్స్‌లో అప్పులు తీర్చేందుకు చైన్ స్నాచింగ్

ప్రేమ జంటను అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అల్వాల్: జల్సాల కోసం అప్పులు చేసి అప్పులు తీర్చడం కోసం దొంగతనాలు చేస్తూ పోలీసులకు దొరికిపోయారు ఓ ప్రేమజంట. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ మండలం చింతల్‌కు చెందిన వడ్డే సాయితరుణ్(23), అర్కుతల సౌమ్య(19)లు రెండు సంవత్సరాల నుంచి ప్రేమించుకుంటున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు లోన్ యాప్స్ ద్వారా రుణం తీసుకుని అవి తీర్చడం కోసం దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం సోమవారం ద్విచక్ర వాహనంపై వచ్చిన వీరు అల్వాల్ హిల్స్‌లో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న సీహెచ్ సువర్ణ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం అల్వాల్ ఐజి చౌరస్తాలో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో వారిని అరెస్టు చేశారు. మూడున్నర తులాల బంగారు గొలుసుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్ తెలిపారు.

బావను చంపిన బావమరిది



మృతుడు యోదేందర్

అల్వాల్: సోదరిని వేధిస్తున్న బావను బండరాయితో మోది బావమరిది హత్య చేసిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్ భారతినగర్‌లో నివాసముండే యోగేందర్(40) జానకిని రెండవ వివాహం చేసుకున్నాడు. అంతకు ముందే జానకికి కూతురు ఉంది. ఇటీవలే జానకి, యోగేందర్‌లు దొంగతనం కేసులో జైలుకు వెళ్లి వచ్చారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి యోగేందర్ భార్యతో గొడవ పడ్డాడు. కూతురిని సైతం కొట్టడానికి వెళ్లగా భార్య జానకి బొల్లారంలో ఉండే తన సోదరుడు సుబ్రహ్మణ్యంకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆగ్రహానికి గురైన సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి యోగేందర్‌ను తీవ్రంగా కొట్టడంతో పాటు బండరాయి ఛాతిపై వేయడంతో తీవ్ర గాయాలైన అతడు మృతి చెందాడు. ఈ ఘటనలో జానకి సైతం సుబ్రహ్మణ్యంకు సహకరించినట్లు తెలిసింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జానకిని అదుపులోకి తీసుకోగా అప్పటికే సుబ్రహ్మణ్యం పరారయ్యాడు. యోగేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.